

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 44

## ఉచిత సలహా

**ఊళ్ళోకి కొత్తగా** వచ్చార్ట శ్రీనివాసు వాళ్ళావిడ రాణి; ఎవరో దూరపు బంధువునబడే పెద్దావిడ ఫోన్ చేసి చెప్పారు; మీరు కూడా అదే ఊళ్ళో ఉన్నారు కదా, కాస్త వాళ్లని పిలిచి స్నేహం చేస్తారా అని. అలాగే అని చెప్పి తెలుగు వాళ్ళు ఎవరో ఒకరు స్నేహితులైతే బానే ఉంటుంది కనక రెడ్డి, వాళ్ళావిడ సునీత ఫోన్ చేసినప్పుడు చెప్పారు ఫలానా శనివారం రాత్రి భోజనానికి వచ్చేయమని. రాత్రి ఏడింటికి వచ్చారు ఆరింటికి రమ్మంటే. వస్తూనే ఏవో పట్టుకువెళ్ళకపోతే బాగోదన్నట్టు కూడా ఓ చాకొలేట్ పేకెట్ పట్టుకొచ్చారు. రెడ్డీ, సునీతా ఈ పేకెట్టు చూసి ఒకరి మొహం ఒకరు చూసుకునే పరిస్థితి. ఏదీ కనుక్కోకుండా, చూసుకోకుండా ఈ చాక్లెట్ పేకెట్ పట్టుకొచ్చారంటే ఏమిటి సంగతి అనుకున్నా పైకి ఏమీ అనలేక ఊరుకున్నారు. భోజనం అయ్యాక సునీత రాణీని లోపలకి పిల్చింది ఏవో కబుర్లు చెప్పుకోవడానికి. రెడ్డి బయట హాల్లో శ్రీనివాస్ తో కబుర్లు మొదలెట్టాడు – ఎక్కడనుంచి వచ్చారు, ఏ కంపెనీ లో పని వగైరా.

దాదాపు పది కావస్తూంటే వెళ్ళడానికి బయల్దేరి చెప్పారు రెండు వారాల తర్వాత మా ఇంటికి రండి, మళ్ళీ ఫోన్ చేసి చెప్తాం అని. దార్లో రాణీ గారు తాను సంపాదించిన డాటా అంతా మొగుడికి చెప్పేసింది. రెడ్డి మంచివాడు కాదు. సునీతని ఏదో ఒక కోర్స్ చేసి ఉద్యోగం తెచ్చుకోమని చెప్తున్నాడు. ఆవిడ పాపం చాలా మెతక మనిషి. నోట్లో నాలిక లేదు,

పల్లెటూర్నించి వచ్చింది కనక అంత బాగా ఇంగ్లీషు రాదు, వచ్చిన మూడు ముక్కలూ సమయానికి నోట్లోంచి రావు. చివరకి వదిలిన బ్రహ్మాస్త్రం ఏమిటంటే – మీ మొగాళ్ళు అందరూ ఇంతే, వెధవలు – మీ మొగాళ్ళు అనేది వత్తి వత్తి పలుకుతూ. శ్రీనివాస్ ఉలిక్కిపడ్డాడు – ఆవిడ గురించి తాను అడగనూ లేదు చెప్తుంటే అడ్డుకోనూ లేదు అయినా మీ మొగాళ్ళు అంటూ తనని కూడ తిడుతోంది.

మూడు నాలుగు నెలల్లో కుటుంబాలు అటూ ఇటూ భోజనాలకి తిరుగుతూనే ఉన్నారు. శ్రీనివాస్ గురించి రెడ్డికీ, రెడ్డి గురించి శ్రీనివాస్ కీ – మొగుళ్ళు ఎంత వెధవలో, ఎందుకూ పనికిరాని వారో కర్ణాకర్ణిగా తెలుస్తూనే ఉంది. ఎప్పుడైనా రెడ్డి సునీతని ఏదైనా కాలేజీలో జేరమన్నా, ఆవిడ మీద అరిచినా అది మర్నాటికి రాణీకి ఫోన్ మీద చేరిపోతోంది. అటువంటి రోజుల్లో ఓ చిన్న కష్టం వచ్చింది. సునీత బంధువుల్లో ఎవరికో రోగం వచ్చిందిట. డబ్బులు ఇస్తారా వైద్యానికి అని అడుగుతున్నారు – అవును ఇండియానుంచే – ఇక్కడ మనందరికీ బేక్ యార్డ్ లో డాలర్ చెట్లు ఉన్నాయని ప్రపంచం అందరికీ తెల్సిందే కదా? అందులో మనం పంపిస్తే అవన్నీ ఉచితం – వాటిని రోగానికి ఖర్చుపెట్టినా ఓ చిన్న నగ చేయించుకున్నా మనకి తెలియక్కర్లేదు, చెప్పరు. రెడ్డికి కోపం వచ్చింది. తనకే పీలకదాకా ఉన్నారు బంధుకోటి. వాళ్ళకీ ఇవ్వాలి. ఇప్పుడు అమ్మగారు ఉద్యోగం చేయరూ, ఉద్యోగం వచ్చే చదువూ చదవరు కానీ ఇలా డబ్బులిస్తారా అని మాత్రం అడిగించుకుంటూ ఉంటారు. నేను ఇవ్వనూ అని ఖరాఖండీగా చెప్పేసాడు. మొదట్లో మౌనం, వంట వండకపోవడం, ఒకర్నొకరు అసహ్యంగా చూసుకోవడం, బాత్రూంలో దూరి తిట్లు అవతలి వాళ్ళకి వినిపించకుండా అయ్యేసరికి ఈ వార్త రాణీగారికి చేరి రెండు రోజులైపోయింది. ఆవిడ ఉచిత సలహా పారేసింది - రాత్రి మొగుణ్ణి దగ్గిరకి రానివ్వకండి, చచ్చినట్టూ కాళ్ళ బేరానికి వస్తాడు. వారం గడిచే సరికి రెడ్డికి చెక్కు రాయడం తప్పలేదు. అలా రెడ్డి ని ఆడించడానికి రాణీగారు సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఇటువైపునుంచి సునీతకి ఆవిడంటే ఆరాధనా భావం పెరిగిపోయింది. అమ్మో, ఆవిడ కాలేజీలో ఎమ్మెస్సీ చదువుకుంది అదీ హైద్రాబాద్ లో ఎవరిని ఎక్కడుంచాలో అన్నీ తెల్సినావిడ. ప్రతీ విషయంలోనూ ఆవిడ సలహా తీసుకోవాల్సిందే. అదీగాక ఆవిడ ఎంత మంచావిడ! ఏమీ అనుకోకుండా ఎప్పుడు ఫోన్ చేసినా సమాధానం చెప్పి సలహా ఇచ్చి ఆదుకోవడంలే?

మరో నాలుగు సార్లు ఇటువంటివి అయ్యేసరికి రెడ్డికి సుమారుగా తన వెనక ఏం జరుగుతోందో తెల్సి రావడం మొదలైంది. అదిగాక రెడ్డి అప్పుడప్పుడూ చీకట్లో బాణం వేసినట్టూ 'మా ఆవిడ.. " ఏదో చెప్పబోయేసరికి రాణి "కొంతమంది కొంచెం స్లో అండి, అదే సర్దుకుంటుంది, మీకే కంగార్లేదు" అనడం, మిగతా విషయాలు చెప్పడం చూస్తే రాణీ గారికి తన భార్యామణి ఫోన్లో అన్నీ చెప్పేస్తోందనే అనుమానం ధృఢపడింది. ఓ రోజు మాటల్లో సునీత అంది కూడా, "అస్తమానూ నేను చదువుకోవాలి ఉద్యోగం చేయాలి అన్ని దెప్పుతున్నారు కదా, మీ ఉద్యోగం ఊడితే నా మీద ఆధారపడదామనా? మీకు అంత భయమా, కాన్ఫిడెన్స్ లేదా? ఇన్సెక్యూరిటీయా? ఇలా ఉంటే అందరూ అదే అంటారు

ముందు ముందు.”  చురుక్కున తగిలిన ఆ మాటలకి సునీతకేసి ఒకసారి చూసాడు నిశితంగా. ఇప్పటివరకూ ఈవిడకొచ్చిన ఇంగ్లీషు తను ఎరిగిందే, ఈవిడ వొకాబ్యులరీ తనకి తెలియంది కాదు. ఇన్సెక్యూరిటీ, కాన్ఫిడెన్స్ అనేవి ఈవిడ ఫలా రాణీగారి దగ్గిరనుంచి పట్టిందన్నమాట. ఇదీ వీళ్ళు ఫోన్ లో మాట్లాడుకునే విషయం – తాను, శ్రీనివాస్ ఎంత వెధవలో అనేది. ఇంతా చేసి తన ప్రయత్నం ఏమిటంటే ఈవిడ చదువుకున్న చదుకు పాడైపోకుండా ఏదో ఒక ఉద్యోగం చేస్తే ఆవిడకే మంచిది కదా, తన బంధుకోటికి డబ్బులు ఇచ్చుకోవచ్చు, తన ఇష్టం వచ్చినట్టూ చేసుకోవచ్చు. కాసేపు ఊరుకున్నాక చెప్పాడు రెడ్డి – “నీకు ఉద్యోగం వస్తే ఆ జీతం రాళ్ళు నేను ఒక్క పైస ముట్టుకోను. కానీ ఆ రాణీ గారితో జాగ్రత్త. ఉచిత సలహా పారేసేవారు ఊరంతా ఉన్నారు కానీ నిజానికి ఆవిడ మనకి ఏమీ కాదు కొన్ని నెలల క్రితం.” సునీత విసురుగా అంది – “మధ్యలో ఆవిడ సంగతి ఎత్తుతారే? ఆవిడ ఎంత మంచిదో?”  దీని రెడ్డి చెప్పేదు సమాధానం – “నీ వొకాబ్యులరీ ఏమిటో నాకు తెల్సు, నీకీ మాటలు నేర్పించి ఆవిడే నిన్ను బురదలోకి దించుతోంది. జాగ్రత్త. సంసారాలు తగలబెట్టే రకం ఈవిడ. తర్వాత చెప్పలేదు అనకు సుమా.”

ఆర్నెల్లు తిరిగాయి. ఈ ఆరునెలల్లో సునీత అనేకానేక విషయాల్లో ప్రావీణ్యత సంపాదించింది, అవును రాణీ ద్వారానే. తనని మొగుడు ఏమైనా చేస్తే తాను పోలీసులకి ఫోన్ చేయవచ్చు – జైల్లో పెడతారు. తనకి రాణీ సపోర్ట్ ఉంది. విడాకుల దాకా వస్తే తనకి ఆయన భరణం ఇవ్వాలి; అమెరికాలో కుటుంబం అంటే మజాకా కాదు. అందుకే “మగ వెధవలు” జాగ్రత్తగా ఉండాలి.  మరో ఆరునెలలకి రెడ్డికీ సునీత కీ ఎప్పట్లాగే పెద్ద యుద్ధం అయింది – ఈ సారి చదువుమీద, డబ్బులుమీదా. సునీత పోలీసులకి నిజంగానే ఫోన్ చేసిందిట. శ్రీనివాస్, రాణీ వెళ్ళి పోలీసులకీ, వాళ్ళకి సర్ది చెప్పి సునీతని తన ఇంటికి తీసుకొచ్చాడు రాత్రికి రాత్రి. ఈ కోపతాపాలు తగ్గాక వాళ్ళే బావుంటారు కదా? అయితే రెడ్డికి ఇది నూట ముప్ఫయ్యో సారి డబ్బులమీదా చదువుమీదా గొడవపడటం. అసలే మొగ వెధవ కదా, పెళ్ళాం దగ్గిరకి రానివ్వకపోతే బతకలేడాయే, అంటూ ఏడిపించడం ఈ కొత్త కుటుంబం వచ్చాకే మొదలైంది.

వారం గడిచినా రెడ్డి శ్రీనివాస్ వాళ్ళింటికి రాలేదు. శ్రీనివాస్ కూడా మాట్లాడలేదు. కోపాలు తగ్గాలి తర్వాత మాట్లాడుకోవచ్చు. రెండో వారంలో ఓ సారి శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసాడు. ఏదో కేంప్ లో ఉన్నాట్ట రెడ్డి మర్నాడు ఫోన్ చేస్తానని చెప్పి పెట్టేసాడు. మర్నాడు కాదు గానీ మూడో నాడు చేసేడు ఫోన్. రెడ్డి చెప్పడం ప్రకారం, “తాను ఎప్పుడూ ఇటువంటి పరిస్థితిలో లేడు. పోలీసు కేస్ వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఈ పోలీసులు తన కంపెనీకి ఫోన్ చేసి తన మేనేజర్ తో చెప్పారుట ఇలా అయింది అని. తల కొట్టేసినట్టైంది రెడ్డికి ఆఫీసులో. అందువల్ల తనకి సునీతకీ ఇంకేమీ సంబంధంలేదు. ఆవిడకి కావాలిస్తే విడాకులు ఇస్తాడు. మరో నెల చూసి ఆవిడ విడాకులకి వెళ్ళకపోతే తానే వెళ్తాడు కోర్టుకి. ఆవిణ్ణి తీసుకెళ్ళింది మీరే, నేనేమీ చేయలేను. పిల్లలు లేరు కనక ఆవిడ కి భరణం అవీ ఇవ్వక్కర్లేదని నా లాయర్ తో చెప్పిస్తా. గుడ్ బై.”

ఇంటికొచ్చి విషయాలన్నీ చెప్పాడు శ్రీనివాస్ సునీతనీ రాణీని కూర్చొబెట్టి. సునీత అంది – "మీరు ఉన్నారు నాకు అది చాలు, నేను ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుంటాను. ఏమీ ఫర్వాలేదు." ఈ సారి దెబ్బ రాణీకి తగిలింది ఈ మాట వల్ల. ఈ సునీత తనింట్లో తిష్ట వేసికుంటుందన్నమాట! తాను ఏదో సహాయం చేద్దామనుకుంది కానీ ఇలా తన పద్మవ్యూహంలోకి అనుకోని శత్రువు, అభిమన్యుడిలా తరుముకుని వచ్చేస్తుందని అనుకోలేదు. వెంటనే అంది, "రెండు మూడు రోజులయితే ఫర్వాలేదు కానీ ఇక్కడే ఉండడం ఎలా కుదురుతుంది?" ఈసారి ఆశ్చర్యపోవడం సునీత వంతు – అదేంటండి, "అన్నింటికీ మేము ఉన్నాం, ఏమీ కంగార్లేదు అని మీరే అన్నారుగా అనేకసార్లు? అందుకే ఆయన్ని విడిచేసి వచ్చాను. ఇప్పుడిలా అంటే ఎక్కడికి వెళ్తా?"

ఆ రోజు రాత్రి శ్రీనివాస్ రాణీని తిట్టని తిట్టులేదు – ఆఖరిగా అన్నాడు, "ఇదన్న మాట నువ్వు చేసే పని ఫోన్ మీద. ఆవిడ సంసారం తగలపడ్డానికి కారణం నువ్వేనేమో కూడా. అనుభవించు. ఈవిడ ఇక్కడ ఎంతకాలం ఉంటుందో ఎలా బయటకి పంపిస్తావో – ఎమ్మెస్సీ చదువుకున్నానని, ఏదైనా చేయగలననీ అనుకునేదానివి కదా? మీ వాళ్లతో మాట్లాడి చెప్తాను ఫోన్ లో నువ్వు చేసే మహాకార్యాలన్నీ." అయితే ఇదంతా నిద్రపోతున్నట్టూ నటించిన సునీత విందన్న మాట దంపతులకి తెలియలేదు. మర్నాడు పొద్దున్నే సునీత చెప్పింది వీళ్ళతో – రాత్రి మీరు పడుకున్నాక రెడ్డిగారు ఫోన్ చేసారు పర్సనల్ గా నాకు. తన దగ్గిరకి వచ్చేయమని, సరిగ్గా ఉంటానని చెప్పారు. నేను వెళ్ళిపోతున్నా, మీ సహాయనికి చాలా థేంక్స్. సునీతని వాళ్ల ఇంటి గుమ్మంలో దింపేసి రెడ్డి మొహం చూడ్డానికి మొహం చెల్లక ఆట్నుంచి అటే వెళ్ళిపోయేడు శ్రీనివాస్. అయితే శ్రీనివాస్ వెళ్ళిపోయాక సునీత రెడ్డి కాళ్ళావేళ్ళా పడి మొత్తం అంతా అర్థం అయ్యేలా అతనికి చెప్పిందనీ, అప్పట్నుంచి వాళ్ళు ఈ స్నేహానికి స్వస్తి పలికారనీ రాణీ గారికి ఏనాటికీ తెలియనివ్వలేదు. ఆవిడ మాత్రం తన ఉచిత సలహాలు ఇస్తూనే ఉంది మిగతా ప్రజలకి.

**నీతిః జీవితం మీది; అనుభవించవల్సింది మీరే. మీ జీవితంతో ఆడుకోవడానికి అవతలివాళ్లకి ఎప్పుడూ సరదానే.**

Post your comments